సాక్షి
పల్నాడు
ఆదివారం । 20 । జులై । 2025



ఒంటి కాలిపై నిలబడి నిరసన

రేపల్లె: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శనివారం కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలియజేశారు.



మంత్రి వినతుల స్వీకరణ

తెనాలి అర్బన్: రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం బోసు రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.



వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

నగరం: మండలంలోని ధూళిపూడిలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

మాజీ మంత్రి విడదల రజినికి నోటీసులు



సత్తెనపల్లి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజినికి సత్తెనపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. చిలకలూరిపేటలోని ఆమె నివాసంలో శనివారం నోటీసులను అందించారు. గత నెల 18న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా జన సమీకరణ చేశారనే నేపంతో పోలీసులు ఆమెపై అక్రమ కేసు నమోదు చేశారు.ఇందులో విచారణకు హాజరు కావాలని నోటీసులు అందించారు.

శాకంబరిగా అమ్మవారు ప్రత్యేక దర్శనం



బాపట్ల అర్బన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నందిరాజుతోటలోని గంగా పార్వతీ సమేత ఓంకార బ్రహ్మలింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం పార్వతి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు కాయగూరలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అంగరంగ వైభవంగా కుంకుమ పూజ నిర్వహించారు. యాభై మంది భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందారు.

565 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 565 అడుగులకు చేరింది. ఇది 244.1480 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 67,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మోపిదేవి ఆలయంలో ఆర్వో ప్లాంట్లు ప్రారంభం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో దివీస్ లెబొరేటరీస్ లిమిటెడ్ రూ.32 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఆర్వో ప్లాంట్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ప్రారంభించారు. దివీస్ ల్యాబ్ ప్రతినిధులు నగేష్, శ్రీనివాస్‌ను ఆలయ ఈఓ శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఘనంగా సత్కరించారు. ఆశీర్వచనాలు అందజేసి స్వామి చిత్రపటం బహూకరించారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు



ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గమ్మను విశ్రాంత ఐపీఎస్ అధికారి రమణకుమార్, ఐఏఎస్ అధికారి ఉదయలక్ష్మి శనివారం దర్శించుకున్నారు. అమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



మోపిదేవి: మోపిదేవిలో వేంచేసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ముగిశాయి. శనివారం ఉదయం పూర్ణాహుతి నిర్వహించారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

- నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులకు కలెక్టర్ సూచన
- సాగర్ నీటి వినియోగంపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి
- కలెక్టరేట్‌లో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం
- ఆగస్టు మొదటి వారం నుంచి నీరు విడుదల చేసేందుకు తీర్మానం



సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు, చీఫ్ విప్, ఎమ్మెల్సీ, జీడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్

నరసరావుపేట: జిల్లాకు సాగర్ కుడి కాలువ ద్వారా వస్తున్న సాగునీటిపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుని సక్రమంగా ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నీటిపారుదల పర్యవేక్షక ఇంజనీరు పి.కృష్ణమోహన్ అధ్యక్షతన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించారు. వినుకొండ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, నరసరావుపేట, గురజాల శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, యరపతినేని శ్రీనివాసరావు, శాసన సమండలి సభ్యులు ఏసురత్నం, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పి.కాంతారావు, వైస్ చైర్మన్ చక్రపాణి, జీడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మక్కెన మల్లికార్జున రావు హాజరయ్యారు.

■ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ సాగర్ నుంచి లభ్యమయ్యే 130 టీఎంసీలతోనే సాగు చేయాలనే విషయాన్ని రైతులంతా దృష్టిలో పెట్టుకోవాలని ఆయన సూచించారు. ఆగస్టు ఒకటి నుంచి మొదటి పంటకు నీరు వదులుతారని, రెండో పంటకు వర్షాలు పడితేనే ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు.

■ గురజాల శాసనసభ్యులు యరపతినేని మాట్లాడుతూ సాగర్ పరిధిలోని 11లక్షల ఆయకట్టు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 3వేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పడిన బుగ్గవాగు రిజర్వాయర్ ఇప్పుడు 1500ఎకరాలకే పరిమితమైందని తెలిపారు. దీనివల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందన్నారు. బుగ్గవాగు స్టోరేజ్‌ను 1.5 టీఎంసీ నుంచి మూడు టీఎంసీలకు పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

సాగునీటి సంఘాలు బలోపేతం

■ జిల్లాలో సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికీ నీళ్లు ఇవ్వడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలను బలోపేతం చేసిందని రాష్ట్ర శాసనసభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. మరో పదిహేను రోజుల్లో సాగర్ సైతం నిండే దశకు చేరుకున్నందున, ఆగస్టు మొదటి వారం నుంచి సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామని వెల్లడించారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రూ.334 కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టుల మరమ్మతులు, అన్ని మేజర్, మైనర్ కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టినట్లు తెలిపారు. నల్లబర్లీ కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని చెప్పారు.

మున్సిపల్ కమిషనర్‌పై చిరు వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు

వినుకొండ: పట్టణ మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌పై చిరు వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులో పద్మప్రియ లాడ్జి ఎదురుగా నిర్మాణ దశలో నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ వద్ద చిరు వ్యాపారులు షాపులు నిర్మాణం కోసం రేకుల షెడ్లు వేసుకున్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ సిబ్బందితో కలిసి వాటిని తొలగించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు నిర్మాణం చేసుకుంటున్నామని చిరు వ్యాపారులు చెపుతున్నా దౌర్జన్యంగా తొలగించారని బాధితులు ఆరోపించారు. 30 ఏళ్లగా తామంతా చిన్నచిన్న షాపులు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని, అన్యాయంగా ఖాళీ చేస్తుండటంతో కమిషనరుపై స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కమిషనర్ దౌర్జన్యాన్ని సీపీఎం నేతలతో పాటు టీడీపీ కౌన్సిలర్ పత్తి పూర్ణ ఖండించారు.

వైఎస్సార్ సీపీ
రాష్ట్ర కార్యదర్శులు వీరే



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట పార్లమెంటుకు ముగ్గురు నాయకులను పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు యెనుముల మురళీధర్‌రెడ్డి (గురజాల), నూతలపాటి హనుమయ్య (పెదకూరపాడు), పడాల శివారెడ్డి (నరసరావుపేట) నియమితులయ్యారు. వీరికి పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయించటం జరుగుతుందని, వీరందరూ కేంద్ర పార్టీ కార్యాలయంలో సమన్వయం చేసుకుంటూ సంబందిత రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారులుగా వ్యవహరిస్తారని కేంద్ర కార్యాలయం తెలిపింది.

పార్టీకి అన్నివిధాలుగా అండగా...



యెనుముల మురళీధర్‌రెడ్డి (గురజాల)

పార్టీ రాష్ట్ర కార్యదర్శులు(పార్లమెంట్)గా నియమితులైన యెనుముల మురళీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నేత. సమస్యాత్మక నియోజకవర్గమైన గురజాలలో పార్టీకి అండగా నిలుస్తున్నారు. ఆయన స్వస్థలం గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం. మురళీధర్‌రెడ్డి 2013లో పెదకూరపాడు నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులుగా పనిచేశారు. పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ పదవులలో సమర్థంగా పనిచేసిన మురళీధర్‌రెడ్డి సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం రాష్ట్ర కార్యదర్శిగా పదోన్నతి కల్పించింది.

మరో నేత నూతలపాటి హనుమయ్యది పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి మండలం అత్తలూరు శివారు గ్రామమైన నూతలపాటివారిపాలెం. ఆయన 2013లో పెదకూరపాడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికలలో జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు.



నూతలపాటి హనుమయ్య (పెదకూరపాడు)

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన యువ నేత పడాల శివారెడ్డి స్వగ్రామం నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల. శివారెడ్డి పల్నాడు జిల్లా యువత విభాగం అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు.



పడాల శివారెడ్డి (నరసరావుపేట)

పల్నాడును ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

- ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు
- స్వచ్ఛతా కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నరసరావుపేట: ప్లాస్టిక్ రహిత జిల్లాగా పల్నాడును తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన'పై ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్లాస్టిక్ నిర్మూలించడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రధానంగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడడం ఆపి జూట్ బ్యాగులను వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ షాపింగ్‌కు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ కవర్ల బదులు జూట్ బ్యాగ్‌లను వాడాలన్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు మొదలు పెద్ద షాపులు, సూపర్ మార్కెట్లలో జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులను వినియోగదారులకు ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన-జూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రజల భాగస్వామ్యం అవసరం అన్నారు. అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. విద్యార్థులు, ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. సేవలను అందిస్తున్న స్వచ్ఛతా కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అనంతరం వెదురుబుట్టల స్టాల్‌ని పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్‌ఓ ఏకా మురళి, ఆర్డీవో కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పులిమి రామిరెడ్డి, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

స్మో'కింగ్'లు బహుపరాక్ !

- పోలీసులకు చిక్కితే కోట్పా యాక్ట్ కింద కేసులు
- పల్నాడు జిల్లాలో 1,235 నమోదు
- రూ.2.45 లక్షల జరిమానా
- నిధులు ఆరోగ్యశాఖకు జమ



యడ్లపాడు: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై రాష్ట్ర ప్రభుత్వం కోట్పా (సిగరెట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్ -2003) కొరడా ఝుళిపించనుంది. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని కఠినంగా అమలు దిశగా పోలీసులు కార్యాచరణ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 8వ తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్‌తో దీనికి శ్రీకారం చుట్టారు. ఈ చట్టం నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు.

చట్టం ఏం చెబుతోంది ?

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్టవిరుద్ధం. బార్లు, రెస్టారెంట్లు, హోటళ్లు, సినిమా థియేటర్లు, వినోద ప్రాంతాలు, మరుగుదొడ్లు, విశ్రాంతి మందిరాలు, దుకాణాలు, బస్‌స్టాపులు, ప్రజా రవాణా వాహనాలు తదితర ప్రదేశాల్లో పొగ తాగడం నిషేధం. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 200 జరిమానా విధించవచ్చు. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు ఉత్పత్తుల విక్రయంపై నిషేధం. మైనర్లకు గుట్కా, పాన్ మసాలా, సిగరెట్ ఇచ్చినా కేసు తప్పదు. పాఠశాలలకు 100 గజాల పరిధిలో విక్రయాలైతే కేసు నమోదు చేస్తారు. విద్యాసంస్థల ప్రహరీపై 'పొగాకు రహిత విద్యాలయం' బోర్డు తప్పనిసరి. నియమాలను తరచూ అతిక్రమిస్తే బీఎన్ఎస్ చట్టం కింద కఠిన చర్యలకు కోట్పా సిఫార్సు చేస్తుంది.

ప్రత్యేక డ్రైవ్‌లో పల్నాడు జిల్లా ముందంజ

ఈగిల్ ఐజీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో పల్నాడు జిల్లా ముందంజలో ఉంది. ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కేవలం ఐదు రోజుల్లోనే 1070 కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,235 కేసులు నమోదయ్యాయి. జరిమానాల కింద రూ. 2,45,600 వసూలు చేశారు. ఈ డ్రైవ్‌ను నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు రావడంతో, జిల్లాలోని 34 పోలీస్ స్టేషన్ల పరిధిలో దీన్ని అమలు చేయనున్నారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ప్రతి కేసుకు విధించే జరిమానా చలానాలు ఆరోగ్యశాఖ ద్వారా జారీ అవుతాయి. వసూలైన మొత్తం ట్రెజరీలో డీఎంహెచ్‌వో అకౌంట్‌లో హెడ్‌లోనే జమ అవుతోంది. జరిమానా రూపంలో చెల్లించిన నిధులు ఇతరులు ఆరోగ్యానికి విరాళంగా మారదాయి.

ఇంటి నుంచే చదువు

- దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లా వ్యాప్తంగా 47 అధ్యయన కేంద్రాలు



ఓపెన్ స్కూల్‌లో బోధన

సత్తెనపల్లి: పాఠశాలలో చదువుకునే అవకాశం లేని పిల్లలు, వయోజనులు, చదువుకు దూరమైన వారు, బడి మధ్యలో మానేసిన వారు, టెన్త్, ఇంటర్‌లో అనుత్తీర్ణులైన వారు, ఔత్సాహిక అభ్యాసకులు, ఉద్యోగ అవకాశాలు, పదోన్నతులు పొందేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వరంగా మారింది. వారు తిరిగి చదువుకునేందుకు ప్రభుత్వం సార్వత్రిక విద్య ద్వారా అవకాశాన్ని కల్పిస్తోంది. ఏపీ ఓపెన్ స్కూల్స్ సొసైటీ 2025-26 విద్యా సంవత్సరానికి గాను టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తోంది.

విద్యార్హతలు ఇవే...

- **పదో తరగతి:** అభ్యర్థి ఏదైనా పాఠశాలలో చదివితే టీసీ గానీ, రికార్డు షీట్ గానీ, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. ఏ పాఠశాలలోనూ ప్రవేశం పొందకపోయినా, ఎటువంటి విద్యార్హత లేకపోయినా పదో తరగతి చదివే సామర్థ్యం ఉంటే ప్రవేశం పొందవచ్చు. 2025 ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.
- **ఇంటర్మీడియెట్:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. మార్కుల జాబితా, టీసీ ఇవ్వాలి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మధ్యమాలో ఒకదాన్ని ఎంపిక చేసుకోవచ్చు. వయో పరిమితి 2025 ఆగస్టు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. ఎంపీసీ, ఎంబైపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి.
- **ప్రవేశ కాల పరిమితి:** ఓపెన్ స్కూల్‌లో ఏ కోర్సులోనైనా రిజిస్ట్రేషన్ పొందిన నాటి నుంచి ఐదేళ్ల వరకు అడ్మిషన్ చెల్లుబాటు అవుతుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025 జూలై 31...రూ.200 ఆలస్య రుసుంతో గడువు: 2025 ఆగస్టు 15
- **దరఖాస్తు విధానం:** పదోతరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోసం ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రోజును ఎంచుకున్న ఓపెన్ స్కూల్ కేంద్రంలో ఇవ్వాలి.

జిల్లాలో 47 అధ్యయన కేంద్రాలు...

జిల్లాలో టెన్త్, ఇంటర్ కలిపి 47 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. వీటిలో టెన్త్‌కు 28, ఇంటర్‌కు 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు రెండవ శనివారం, ఆదివారం, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందిస్తారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలను బోధన చేస్తున్నారు. అభ్యర్థులు 30 తరగతులకు హాజరు కావాలి.

జిల్లాలో నేరాలు తగ్గుముఖం

- అర్ధ వార్షిక నేర సమీక్షలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు.
- మహిళలు, బాలికలపై దాడుల నియంత్రణకు కఠిన చర్యలు
- డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం
- రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి



జిల్లా అదనపు న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్ : బాలికలు, మహిళలు, వృద్ధులపై దాడులు అరికట్టేందుకు వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పోలీసులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. అరుణ్ బాబు తెలిపారు. పట్టణంలోని ఏ-1 కన్వెన్షన్ సెంటర్లో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, 13వ అదనపు జిల్లా జడ్జి ఎస్. సత్యశ్రీ హాజరయ్యారు. గత ఆరు నెలలుగా జిల్లాలతో చోటు చేసుకున్న నేరాలను విశ్లేషించారు.

నియంత్రణలో నేరాలు

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరు నెలల్లో జిల్లాలో 2,232 కేసులు నమోదైనట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాలు నియంత్రణలో ఉన్నాయని వివరించారు. జిల్లాలో డ్రగ్స్ గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీఆర్‌వో పాకా మురళి, జిల్లా మెడికల్ ఆఫీసర్ రవి, ఉమ్మడి గుంటూరు జిల్లా ఫోరెన్సిక్ సైన్సెస్ అధికారి రవికుమార్, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.

వృద్ధులపై దాడులను అరికట్టాలి

కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ వృద్ధులపై దాడులను నియంత్రించేందుకు సీనియర్ సిటిజన్ యాక్ట్‌ను ఉపయోగించి, రెవెన్యూ, పోలీస్ శాఖలు కలిసి పని చేయాలని సూచించారు. తన ఫేస్‌బుక్‌పై ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కోరారు. డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యువతలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం రవాణా పెద్దఎత్తున జరుగుతుందని, దీన్ని అరికట్టే దిశగా రెవెన్యూ, పోలీస్ శాఖలు పని చేయాలని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

సీపీఎస్ కంట్రిబ్యూషన్ 14 శాతానికి పెంచాలి

క్రోసూరు: సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వ కంట్రిబ్యూషన్‌ను 10 నుంచి 14 శాతానికి పెంచాలని ఎస్టీయూ సీపీఎస్ కన్వీనర్ తూమాటి శరత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2019 జనవరి 1న సెంట్రల్ గెజిట్ నోటిఫికేషన్ (నంబర్ 1.3.2016– పీఆర్)ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ లేదా ఎన్‌పీఎస్ విధానంలో ఉన్న ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు (ఏఐఎస్), ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లకు మాత్రమే కంట్రిబ్యూషన్‌ను 14 శాతం పెంచుతున్నట్లు జీవో 1338ని విడుదల చేసినట్లు తెలిపారు. మిగిలిన సీపీఎస్ ఉద్యోగులకు కంట్రిబ్యూషన్‌ను 10 శాతానికే ఉంచడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సీపీఎస్ ఉద్యోగులందరికీ 14 శాతం కంట్రిబ్యూషన్‌ను వర్తించేలా ఆదేశాలు జారీ చేయాలని శరత్‌కుమార్ కోరారు.

హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట: నేషనల్ హ్యూమన్ రైట్స్ (మానవ హక్కుల పరిరక్షణ) కమిటీ పల్నాడు జిల్లా అధ్యక్షులుగా తుమ్మూరు శ్రీనివాసరెడ్డిని రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్యామల జై కోటిరెడ్డి నియమించారు. ఈ మేరకు శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో నియామకపు ఉత్తర్వులు అందజేశారు. నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ యాసిన్ ఆదేశాల మేరకు శ్రీనివాసరెడ్డిని పల్నాడు జిల్లా చైర్మన్‌గా నియమించినట్లు డాక్టర్ జై కోటిరెడ్డి వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ శ్రీనివాసరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పౌర హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

తూతూమంత్రంగా పొగాకు కొనుగోలు

అధికారుల ముందు రైతుల ఆవేదన



పొగాకు కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ రమేష్‌బాబు

నాదెండ్ల: గణపవరం రెవెన్యూ పరిధిలోని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శనివారం పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ రమేష్‌బాబు పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అధికారులు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతను బట్టి క్వింటా రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలకు కొనుగోలు చేయాల్సి ఉండగా, మొక్కుబడిగా కొంత పొగాకుకు మాత్రమే అధిక ధరకు కొంటున్నారని తెలిపారు. మిగిలిన పొగాకును తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. అనేక సాకులు చెబుతూ పొగాకును తిరస్కరిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదంటూ వాపోయారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎస్. చంద్రశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

ప్రభుత్వ తీరుపై పసుపు రైతుల ఆగ్రహం

- కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద బాధితులకు క్వింటాకు రూ.7 వేలివ్వాలి
- బీమా పరిహారంతో సరిపెట్టడంపై అన్నదాతల మండిపాటు
- మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం నగదు కూడా చెల్లించాలని డిమాండ్



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న రైతులు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో గతేడాది జనవరిలో దగ్ధమైన పసుపునకు వచ్చిన మొదటి విడత బీమా పరిహారం సరిపోదని, మంత్రి అచ్చెన్నాయుడు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాకు రూ.7 వేలు ఇవ్వాల్సిందేనని బాధిత పసుపు రైతులు డిమాండ్ చేశారు. తొలి విడత బీమా పరిహారం వచ్చిన నేపథ్యంలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహను శనివారం బాధిత రైతులు కలిశారు. గుంటూరులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బీమా పరిహారం చెక్కును అందజేస్తారని సబ్ కలెక్టర్ చెప్పారు. రైతులు మాత్రం తమకు బీమాతోపాటు క్వింటాకు రూ.7 వేల చొప్పున సాయం కూడా ఒకేసారి వచ్చేలా చూడాలని కోరారు. మార్కెటింగ్ శాఖ అధికారి, దుగ్గిరాల పసుపు యార్డు కార్యదర్శి కూడా అక్కడకు వచ్చారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్‌తో మాట్లాడి తమ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరారు. ఫోనులో ప్రయత్నించినా అందుబాటులోకి రావడం లేదంటూ మార్కెటింగ్ అధికారులు వెళుతుండగా రైతులు ఆందోళన చేశారు. బీమా పరిహారం వరకు తీసుకుంటే అప్పులవాళ్లు తమ వెంటబడతారని, అరకొర డబ్బులతో అందరికీ సర్దుబాటు చేయడం సాధ్యం కాదన్నారు. తమకు న్యాయం చేయాలని, మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం డబ్బులు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. తమలో తాము చర్చించుకున్న అనంతరం రైతులు గుంటూరు వెళ్లి మంత్రి పెమ్మసానితో మాట్లాడి తేల్చుకుందామని బయలుదేరారు.

సీఏలకు పుష్కల అవకాశాలు

ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్



గుంటూరు ఎడ్యుకేషన్: చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ)లకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఉపాధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ తెలిపారు. ఐసీఏఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సీఏ విద్యార్థుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ప్రసన్నకుమార్ మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఏ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఐసీఏఐ కృషి చేస్తోందన్నారు. గుంటూరులో సీఏ విద్యార్థుల కోసం ఐసీఏఐ భవన్‌ను ఆధునిక వసతులతో నిర్మిస్తున్నామని తెలిపారు. సీఏ కోర్సుల విద్యార్థులకు ఐసీఏఐ స్టైఫండ్ ఇస్తోందన్నారు. సమావేశంలో ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, కార్యదర్శి ఎస్.రాజశేఖర్, గుంటూరు బ్రాంచి చైర్మన్ చింతా రఘునందన్, వైస్ చైర్మన్ బి.ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ జోనల్ క్యారమ్స్ టోర్నీ న్యాయ నిర్ణేతగా జలీల్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారుడు, ఏపీ క్యారమ్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్‌ను ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ క్యారమ్స్ సెలక్షన్స్ ట్రయల్స్ 2025–26కు గాను ముఖ్య న్యాయ నిర్ణేతగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతోపాటు ఆయన జోనల్ క్యారమ్స్ సెలక్షన్స్ కమిటీ సభ్యునిగానూ ఎంపికయ్యారు. రాష్ట్రంలో జలీల్‌కు మాత్రమే ఇటువంటి అవకాశం దక్కింది. జలీల్ ఇప్పటికే అంతర్జాతీయ రిఫరీగానూ, జాతీయ క్యారమ్స్ ప్యానెల్ కోచ్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జలీల్‌కు ఆల్ ఇండియా క్యారమ్స్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి, ఏపీ క్యారమ్స్ సంఘం చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు ఎంకేవీ ప్రసాద్, సెలక్షన్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఇసుక దర్శి ఫ్లైఓవర్‌పై జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. విజయవాడ నుంచి నెల్లూరు జిల్లా కలిగిరికి ఉల్లిపాయల లోడుతో వెళుతున్న టాటా ఏస్ వాహనాన్ని అదే మార్గంలో ఝార్ఖండ్ నుంచి నెల్లూరు వెళుతున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ప్రమాదంలో టాటా ఏస్ డ్రైవర్ చిలక మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది గాయపడిన డ్రైవర్ మహేష్‌ను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.600 కోట్లు ఎక్కడ?

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ జీ

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తుందని ఈనెల 12వ తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని, వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకు విడుదల కాలేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ అన్నారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్య లింగం భవన్‌లో నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు డిగ్రీలు, పీజీలు పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, అజయ్, శివ గోపి పాల్గొన్నారు.

పెట్రోల్ కల్తీపై అధికారుల తనిఖీ



బంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మాచవరం: స్థానిక ఇండియన్ ఆయిల్ బంక్‌లో పెట్రోల్‌కు బదులుగా నీళ్లు రావడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. కొంత దూరం ప్రయాణించిన తర్వాత వాహనాలు నిలిచిపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఆయిల్ ట్యాంక్‌లో నీళ్లు చేరడంతో ఇంజిన్లు పాడైపోయాయని మెకానిక్‌లు చెప్పడంతో బంక్ వద్దకు చేరి నిర్వాహకులను నిలదీశారు. బంక్‌లోని ఓ పైపు నుంచి నీళ్లు రావడాన్ని గమనించి, అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం పెట్రోల్ బంక్‌ను డీఎస్‌వో ప్రసాదరావు, అధికారులతో కలిసి పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. పెట్రోల్ శాంపిల్‌ను సేకరించి ఉన్నతాధికారులకు పంపించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో ప్రసాదరావు మాట్లాడుతూ బంక్‌లోని ఓ పైపు నుంచి నీళ్లు రావడం వాస్తవమేనని, మరోపైపు సక్రమంగానే ఉందని తెలిపారు. వ్యత్యాసాలను గమనించి నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు చెప్పారు. ఆదివారం సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు పరిశీలిస్తారని, కల్తీ జరిగినట్లు నిరూపణ అయితే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, డీటీలు ప్రభాకర్ రావు, స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

విలువైన స్థలాలు లూలూకి ధారాదత్తం తగదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు
- విజయవాడ ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలం అప్పగించే ప్రతిపాదనలు ఉపసంహరించాలి



మాట్లాడుతున్న బాబూరావు

సత్తెనపల్లి: రాష్ట్రంలో విలువైన ఆర్టీసీ స్థలాలను బడా కంపెనీ లూలూకి ప్రభుత్వం కట్టబెట్టడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు విమర్శించారు. పల్నాడు జిల్లా సీపీఎం విస్తృత సమావేశం సందర్భంగా సత్తెనపల్లి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 400 కోట్లకు పైగా విలువైన విజయవాడ పాత బస్టాండ్, ఇతర ఆర్టీసీ స్థలాలను బడా, బహుళ జాతి కంపెనీ అయిన లూలూకు మాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు ఆర్టీసీ డిపోలు నడుస్తున్న ఈ స్థలాన్ని లూలూ కంపెనీకి ధారాదత్తం చేయడం అంటే ఆర్టీసీ సంస్థను, ప్రజా రవాణాను దెబ్బ తీయడమే అవుతుందని తెలిపారు. ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని రవాణా, ప్రజా ఉపయోగ కార్యక్రమాలకే వినియోగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ స్థలాలను లూలూ కంపెనీకి కట్టబెడితే నగర ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని, ప్రతిఘటిస్తామని చెప్పారు. ఆర్టీసీని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పాల్గొన్నారు.

డబ్బులు కోసం కట్టేసి కొట్టారు

దమ్మాలపాడులో దురాగతం

దమ్మాలపాడు(ముప్పాళ్ల): డబ్బులు ఇవ్వాలంటూ ఇంటి పైకి వెళ్లి.. బయటకు లాక్కొచ్చి..చేతులు కట్టేసి హింసించిన సంఘటన పల్నాడు జిల్లా దమ్మాలపాడులో శనివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన దమ్మాలపాటి రవి గోల్డ్ అప్రయిజర్‌గా పనిచేస్తూ గుంటూరులో ఉంటున్నారు. అదే కాలనీకి చెందిన ఆర్ఎంపీ వీరాంజనేయులుతో ఇంటి స్థలం దగ్గర వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో రవి శుక్రవారం దమ్మాలపాడులోని కుటుంబ సభ్యుల ఇంటికి వచ్చారు. ఇది తెలుసుకున్న వీరాంజనేయులు సమీప బంధువు, గ్రామానికి చెందిన సూరిబాబు, అతని స్నేహితుడితో కలిసి రవి ఉన్న ఇంటి వద్దకు వచ్చారు. లోపలకు వెళ్లి ఇంట్లోంచి బయటకు లాక్కొచ్చి ఆయనపై దాడి చేశారు. అనంతరం చేతులు కట్టేసి సమీపంలోని రామాలయం వద్ద గందరగోళం సృష్టించారు. మళ్లీ బొడ్డురాయి సెంటర్‌కి తీసుకొచ్చి చేతులు కట్టేసి నానా రకాలుగా హింసించారు. రవి బంధువులు బతిమాలినా వినకుండా ''మాకు డబ్బులు ఇవ్వాలని, ఎవరైనా సరే ఇచ్చి తీసుకెళ్లా''లంటూ కొద్దిసేపు హంగామా సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరి రవిని వారి నుంచి విడిపించారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దాడికి పాల్పడిన వారు, బాధితుడు అంతా టీడీపీ సానుభూతిపరులే కావడంతో వివాదాన్ని పరిష్కరించేందుకు కూటమి నాయకులు పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. రవి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రకటించిన జిల్లా అధ్యక్షులు శశికుమార్

నరసరావుపేట: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యవర్గాన్ని అధ్యక్షులు ఏలూరి శశికుమార్ నియమించారు. పార్టీ కార్యాలయంలో శనివారం కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఇత్తడి కిరణ్, కామినేని హనుమంతరావు (నరసరావుపేట), మల్లెల శివనాగేశ్వరరావు(చిలకలూరిపేట), గొడవర్తి సుజాత(వినుకొండ), గోగినేని వెంకటరమణ(పెదకూరపాడు), బోదల సీతాదేవి (సత్తెనపల్లి), జె.బ్రహ్మయ్య (మాచర్ల), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా కె.సుబ్బారావు(వినుకొండ), సెట్టి హనుమంతరావు (మాచర్ల) నియమితులయ్యారు. జిల్లా కార్యదర్శులుగా జె.లక్ష్మి(నరసరావుపేట), జి.హేమకుమార్ (చిలకలూరిపేట), కె.జాన్‌బాబు (వినుకొండ), బి.సులోచన(పెదకూరపాడు), జి.లక్ష్మి (మాచర్ల), ఎం.శివరత్నకుమార్(సత్తెనపల్లి), ఎస్.పుల్లారెడ్డి, కె.ఆంజనేయులు (మాచర్ల), ఐటీ కన్వీనర్‌గా రామిశెట్టి యశ్వంత్(నరసరావుపేట), సోషల్ మీడియా కన్వీనర్‌గా వంకాయలపాటి వంశీ(చిలకలూరిపేట)లను నియమించారు.

ఇంజినీరింగ్ విద్య ఒక్కటే గమ్యం కాదు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు

జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్

తెనాలి: విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య ఒక్కటే గమ్యం కాదనీ.. అది లేకపోతే జీవితం వ్యర్థం అనే భావనలను ముందుగా తల్లిదండ్రులు విడనాడాలని కాకినాడ జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ డాక్టర్ చేకూరి శివరామకృష్ణప్రసాద్ అన్నారు. పట్టణానికి చెందిన మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు సంస్థ వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సభలో మొవ్వా విజయలక్ష్మి స్మారక నాలుగో అవార్డును తెనాలికి చెందిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాపకు బహూకరించారు. ఇదే సభలో గత మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో 550, ఆపైన మార్కులు సాధించిన 60 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.5 వేల చొప్పున రూ.3 లక్షల నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. ముఖ్యఅతిథి డాక్టర్ శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిచేసుకుని బయటకు వచ్చేవారిలో 15 శాతం మాత్రమే ఉద్యోగాలకు అర్హులని నివేదికలు చెబుతుంటే లోపం ఎవరిదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్‌లో 1.90 లక్షల కన్వీనర్ సీట్లుంటే 1.40 లక్షలు కూడా భర్తీకావటం లేదన్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడారు.

విద్యార్థుల చేతుల్లోనే బంగారు భవిష్యత్తు

డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన రీతిలో వాడుకుంటే సెల్‌ఫోన్ బ్రహ్మాస్త్రమని సోదాహరణంగా చెప్పారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి తన ప్రసంగంలో బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని విద్యార్థుల నుద్దేశించి అన్నారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ మాతృభాషలో సౌమ్యంగా మాట్లాడటం, చుట్టూ ఉన్న అందరితో సత్సంబంధాలు కొనసాగించటం, చేసే ప్రతిపనికి ఎవరికి వారు బాధ్యత వహించటం అలవాటు చేసుకుంటే ఏ టెక్నాలజీ వచ్చినా ఇబ్బంది ఉండదన్నారు. డ్రగ్స్, ఆల్కహాలు, ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. తొలుత బెల్లంకొండ వెంకట్ స్వాగతం పలికారు.

కొల్లిపరలో 98.6 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 98.6 మిల్లీ మీటర్లు వర్షపాతం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో 0.8 మి.మీ. పడింది. సగటు 15.3 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలంలో 61.2, పెదకాకాని 24.2, గుంటూరు పశ్చిమ 20.2, దుగ్గిరాల 16.4, ఫిరంగిపురం 14.4, పెదనందిపాడు 7.6, తెనాలి 7.4, తాడేపల్లి 6.2, మేడికొండూరు 5.2, తుళ్ళూరు 4.8, తాడికొండ 4.2, గుంటూరు తూర్పులో 4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.